క్లుప్తంగా

ఏఓగా శిరీష బాధ్యతల స్వీకరణ



కొందుర్గు: మండల వ్యవసాయాధికారిగా శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొందుర్గ ఏఓగా పనిచేస్తున్న మధుసూదన్‌ను సస్పెన్షన్ చేస్తూ శుక్రవారం అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఏఓగా కేశంపేట మండల వ్యవసాయాధికారిణి శిరీషను నియమిస్తూ జిల్లా వ్యవసాయాధికారులు ఆదేశాలు జారీచేశారు.

'దేవాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించండి'



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

కొందుర్గు: పెండ్యాల లక్ష్మీనరసింహ్మస్వామి దేవాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని నిర్వాహకులు సంబంధిత అధికారులను మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు దేవాలయానికి విద్యుత్ లైన్ ఏర్పాటునకు స్థల పరిశీలన చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ తెలిపారు. లైన్ ఏర్పాటుకోసం అంచనా నివేదిక సిద్ధం చేస్తామని, దీనికోసం సంబంధిత చలాన్ చెల్లిస్తే విద్యుత్ లైన్ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ రామలింగం, రాములు గౌడ్, కృష్ణయ్య, అశోక్, నర్సింలు, వేణుగోపాల్, అమరలింగం పాల్గొన్నారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న ఫౌల్ట్రీ వ్యాపారులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయానికి రంగులు వేసేందుకు మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి శేషయ్య నగర్ ఫౌల్ట్రీ వాసులు రూ.లక్షా 20వేలు విరాళం అందజేశారు. బుధవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతూరి వెంకట్‌రావు, సత్యనారాయణ, మన్నయ్య, పాతూరి రఘుపతి, చేగూరి వేణుగోపాల్, గంధం శేఖర్, రాయల్ శంకర్, పలబట్ల బాల్‌రాజ్, సాయికృష్ణ, ఒగ్గు కిషోర్, సూరిశెట్టి నర్సింలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు రాహుల్‌గుప్తా



ఇఫ్తార్‌లో రాహుల్‌గుప్తా, గుండాల అశోక్

షాబాద్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు రాహుల్‌గుప్తా పేర్కొన్నారు. బుధవారం రాత్రి షాబాద్ మండల కేంద్రంలోని మసీద్‌లో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీ గుండాల అశోక్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ



పాండురంగారెడ్డితో గోవర్ధన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన పాండురంగారెడ్డిని బుధవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'డబుల్' ఇళ్లు

- అజీజ్‌నగర్‌లో పూర్తయినా అర్హులకు అందని వైనం
- సురంగల్‌లో కొనసాగుతున్న పనులు
- ఎన్నికల కోడ్‌తో మరింత ఆలస్యం
- ఇబ్బందుల్లో లబ్ధిదారులు



సురంగల్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్‌బెడ్రూం ఇళ్లు



అజీజ్‌నగర్‌లో పంపిణీకి నోచుకోని ఇండ్లు

మొయినాబాద్: పదేళ్లుగా కలలు కంటున్న 'డబుల్' ఇళ్లు నేటికి అందని ద్రాక్షాగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇండ్ల నిర్మాణం నేటికి నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో కొన్ని పూర్తయి, మరికొన్ని అసంపూర్తిగా, ఇంకొన్ని పంపిణీకి నోచుకోని ఇళ్లు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ నిర్మాణాలు పూర్తయిన ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పంపిణీకి మరింత జాప్యం అయ్యేఅవకాశం లేకపోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారంలో కొచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలోని సురంగల్, అజీజ్‌నగర్, కనకమామిడి, చిలుకూరు, చిన్నమంగళారం, తోలుకట్ట తదితర గ్రామాలకు 2016లో ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతులమీదుగా పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. ఆ తరువాత రెండేళ్లకు సురంగల్, అజీజ్‌నగర్ గ్రామాల్లో మాత్రమే నిర్మాణ పనులు మొదలు పెట్టారు. సురంగల్‌కు 20 మంజూరు కాగా 16మాత్రమే పనులు చేపట్టారు. అవీకూడా అసంపూర్తిగానే మిగిలాయి. అజీజ్‌నగర్‌లో 40 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు ఎనిమిదేళ్ల పాటు నిర్మాణ పనులు కొనసాగాయి. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఇప్పటి వరకు వాటిని ప్రారంభించలేదు. పంపిణీ చేయలేదు.

ఏడాది క్రితమే గుర్తింపు

గ్రామాల్లో నిర్మించిన ఇళ్లను పేదలకు ఇచ్చేందుకు ఏడాది క్రితమే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించారు. అసెంబ్లీ ఎన్నికల ముందే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి అప్పగించాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. కానీ అప్పట్లో పనులు పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులకు అప్పగించలేదు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఇళ్లను అప్పగించలేదు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడం చకచకా జరిగిపోయాయి. కానీ ఇండ్ల పంపిణీ విషయంలో లబ్ధిదారులు అయోమయంలో ఉండిపోయారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు కొత్త ప్రభుత్వంలో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని శరవేగంగా ప్రయత్నం చేశారు. అంతలోనే మళ్లీ లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో చేసేదేమిలేక మిన్నకుండిపోయారు. ఈ విషయంలో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. చేసేదేమి లేక తమకు ఇళ్లు అందవన్నట్టుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్లుగా ఎదురు చూస్తున్నాం

ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తుందని పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కానీ చివరి దశలో పనులు ఆగిపోయాయి. కాంట్రాక్టర్ పనులు చేయడంలేదో? అధికారులు చేయించడం లేదో? అర్థం కాలేదు. వేగంగా నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి త్వరగా మాకు పంపిణీ చేస్తే సంతోషిస్తాం.

– మహ్మద్ కలీం, సురంగల్

అర్హులకు అలాట్ చేశాం



మండలంలోని అజీజ్‌నగర్, సురంగల్ గ్రామాల్లో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది. అర్హులను గుర్తించి అలాట్ చేశాం. కానీ కొన్ని చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉండడంతో వారికి ఇళ్లు అప్పగించలేదు. అజీజ్‌నగర్‌లో డోర్లు, కిటికీలు, నల్లాలు బిగించాల్సి ఉంది. పూర్తయిన వెంటనే అప్పగిస్తాం.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

జ్ఞాపక శక్తి పెంచేందుకే క్విజ్ పోటీలు



క్విజ్ పోటీ నిర్వహిస్తున్న వెల్‌స్పన్ ఫౌండేషన్ నిర్వాహకులు

చేవెళ్ల: విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంచేందుకే క్విజ్ పోటీలు తోడ్పడుతాయని చేవెళ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యాలక్ష్మి, అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం వెల్‌స్పన్ ఫౌండేషన్, శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాబాద్, చేవెళ్ల మండలాల్లోని మాచన్‌పల్లి, మద్దూరు, హైతాబాద్, తాళ్లపల్లి, కొకుంట్ల, కేజీబీవీ, చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. క్విజ్ పోటీలతో జనరల్ నాలేడ్జ్ పెరుగుతుందన్నారు. ప్రథమ బహుమతి కొకుంట్ల పాఠశాల, మద్దూరు పాఠశాలకు, రెండో బహుమతి చేవెళ్ల ప్రాథమిక పాఠశాల, హైతాబాద్ ఉన్నత పాఠశాలకు, మూడో బహుమతి మాచనపల్లి, కేజీబీవీ చేవెళ్ల పాఠశాల విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికేట్‌ల ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వెల్‌స్పన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య, శిక్షణ ఫౌండేషన్ కె. రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నక్కర్తమేడిపల్లి మీదుగా రైల్వే లైన్

- ఇటీవల ప్రధాన రోడ్డుపై మార్కింగ్ చేసిన రైల్వే అధికారులు
- జిల్లా మీదుగా డోర్నకల్–గద్వాల రైల్వే మార్గం



తక్కళ్లపల్లి–నక్కర్తమేడిపల్లి మధ్య మార్కింగ్

యాచారం: మండలంలోని పలు గ్రామాల మీదుగా కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కాబోతున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల కింద మండల పరిధిలోని తక్కళ్లపల్లి–నక్కర్తమేడిపల్లి గ్రామాల మీదుగా రైల్వే అధికారులు రైల్వేలైన్ నిర్మాణం కోసం మార్కింగ్ చేసి గుర్తులేశారు. సౌత్ సెంట్రల్(ఎస్‌సీఆర్) రైల్వేశాఖ గతేడాది డోర్నకల్–గద్వాల వరకు రైలుమార్గాన్ని ప్రతిపాదించినట్లు తెలిసింది. అందులో భాగంగానే ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా గద్వాలకు నూతన రైల్వే మార్గం ఏర్పాటు కానుంది. అందులో భాగంగానే కొద్దిరోజుల కింద సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ అధికారులు రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్, తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల మీదుగా గద్వాల వరకు కొత్త రైల్వే లైన్ మార్గం కోసం సర్వే చేసి ఆయా ప్రాంతాల్లో మార్కింగ్ వేసి హద్దులు గుర్తించింది. డోర్నకల్ నుంచి గద్వాల వరకు వెళ్లే రైలు మార్గం రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూర్ మండలాలతో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, భూత్పూర్ తదితర ప్రాంతాల మీదుగా ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. మండలం మీదుగా కొత్త రైల్వే మార్గం ఏర్పాటు కాబోతున్నట్లు మార్కింగ్ గుర్తులు చూసిన స్థానికులు ఒకింత సంతోషం, మరింత ఆందోళన చెందుతున్నారు. రైల్వే మార్గం కావాల్సిన భూమిని ఏ మేరకు సేకరిస్తారోనని రైతుల్లో భయాందోళన నెలకొంది. ఇదే విషయమై రోడ్డు భవనాల శాఖ అధికారులను సంప్రదిస్తే తమకేమి సమాచారం లేదని అంటున్నారు.

ముందస్తు అరెస్టులు బాధాకరం

- ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్



సూర్యప్రకాశ్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి

షాబాద్: ముందస్తు అరెస్టులు బాధాకరమని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం బోడంపహాడ్ గ్రామంలో ఏబీవీపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి షాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు నూతన భవనానికి కేటాయించడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా గడవకముందే ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో 100 ఎకరాల భూమిని హైకోర్టు నూతన భవనానికి కేటాయిస్తూ జీవో నెంబర్ 55ను విడుదల చేయడం హేయమైన చర్యనన్నారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకుంటారనే భయంతోనే ముందస్తు అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

జీవన్‌రెడ్డి విజయం ఖాయం

- పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్



మాట్లాడుతున్న బాబర్‌ఖాన్ తదితరులు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి విజయం ఖాయమని పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబర్‌ఖాన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు రఘు మాట్లాడారు. చిన్న నాటి నుంచి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పారిశ్రామికవేత్తగా ఎదిగిన మన్నె జీవన్‌రెడ్డి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన గెలిస్తే పాలమూరు ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, బస్వం, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు

- ఎస్ఐ రామకృష్ణ



కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గ్రామాల నుంచి వచ్చే రోడ్లతోపాటు ప్రధాన రోడ్లపై వాహనాలను నిలిపి చెక్ చేసి పంపిస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదును వాహనాల్లో తీసుకెళ్లవద్దని.. ఒకవేళ అత్యవసరమైతే తగిన రశీదు చూపించాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో హంస వాహనసేవ నిర్వహించారు. అలివేలు మంగా, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఊరేగించారు. బుధవారం ఉదయం ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ స్నేహలత, క్లర్క్ ఆంజనేయులు, ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కౌన్సిలర్ కృష్ణవేణి దంపతులను పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సోలీపూర్ గ్రామ బీఆర్ఎస్‌కి చెందిన కౌన్సిలర్ కృష్ణవేణి, దిలీప్‌చంద్ర దంపతులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం అన్నారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, రఘు, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- చేవెళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి



మాట్లాడుతున్న శోభారాణి

షాబాద్: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని చేవెళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం శోభారాణి మాట్లాడుతూ పోషకాహార లోపాన్ని నిర్మూలించడమే పోషణాభియాన్ లక్ష్యమన్నారు. చిరుధాన్యాలతో కూడిన పదార్థాలు, అందుబాటులో ఉండే ఆకుకూరలు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఎనిమియా వంటి వ్యాధులు సక్రమించవని సూచించారు. పుట్టిన బిడ్డకు ఖచ్చితంగా ముర్రుపాలు పట్టించాలని పేర్కొన్నారు. 3నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్‌కు పంపించాలన్నారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత గూర్చి వివరించి చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రక్తహీనత నివారణకు పౌష్టికాహారమే ఏకైక మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, సృజన, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు శ్రీశైలం, విజయశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు మీనా, సౌభాగ్య, అంబుజాక్షి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

చేవెళ్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలరని ప్రతీవిద్యార్థి తప్పకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో జనహిత సేవా సమితి వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు ఉచితంగా బ్లెడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులకు ఎనిమియా సమస్య ఉన్నవారికి ఐరన్, పోలిక్ యాసిడ్ మందులు అందజేశారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్లెడ్ గ్రూపింగ్ గురించి తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే ఎవరి బ్లెడ్ గ్రూప్ వారికి తెలిస్తే వెంటనే వారికి అందించొచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్యాపకులను, జనహిత సేవా సమితి వారిని అభినందించారు. అనంతరం జనహిత సేవా సమితి ప్రతినిధి నర్సింహమూర్తి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలతో పేద విద్యార్థులకు వైద్యం అందించటమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డాక్టర్ జ్యోతి, అధ్యాపకులు అనురాధ, షేక్ మహబూబ్, రూప్రారవింద్రన్, మల్లయ్య, వైష్ణవి, సతీశ్, రవీందర్, శకుంతల, వెంకటేశ్వర్లు, వీరేశం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లలో రజాకార్ సినిమా ప్రదర్శన

- ఉచితంగా ప్రదర్శింప చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సినిమా చూస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

చేవెళ్ల: నిజాం కాలంలో రజాకార్‌ల అఘాయిత్యాలు, దాష్టికాలను కళ్లకు కట్టినట్లు చూపించిన సినిమా రజాకార్ అని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని మనికంఠ సినిమా థియేటర్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల షోను ముందుగానే బుక్ చేసి ఆయన ఉచితంగా ప్రదర్శింప చేయించారు. చేవెళ్ల మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. దీన్ని ముందుగానే ప్రచారం చేయటంతో పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి ఈ సినిమా చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తెలంగాణ ప్రాంతానికి మాత్రం స్వాతంత్ర్యం రాలేదన్నారు. అప్పటి నిజాం పాలనలోని హైదరాబాద్ సంస్థానాన్ని పాలించిన నిజాం పేద ప్రజలపై హింసలు, పెట్టిన బాధలు, తిరుగుబాటులను ఈ తరం, భవిష్యత్ తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉందని చెప్పారు. అందుకే ప్రతిఒక్కరూ ఈ సినిమాను చూడాలని చెప్పారు.

సకాలంలో రుణాలు చెల్లించండి



మాట్లాడుతున్న బక్కన్న యాదవ్

- పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్

షాద్‌నగర్: రైతులు తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బక్కన్న యాదవ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నాయన్నారు. రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, సంఘం అభివృద్ధికి పాటు పడాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం రాయితీని అందజేస్తుందన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, సంఘం కార్యదర్శి రఘునందన్, బాబు నాయక్, పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564